క్లుప్తంగా

14న మంత్రుల ఇళ్ల ముట్టడి

పెద్దాపురం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును రక్షించాలని, పింఛన్లు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 14వ తేదీన తునిలో చేపట్టే మంత్రి ఇంటి ముట్టడి నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం మంత్రి ఇంటి ముట్టడి రాయబారంపై ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సురేష్, ఈశ్వరరావు, చింతల సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మతల్లి పసర పండగ



అమ్మవారి బుట్టను ఊరేగిస్తున్న ఆసాదులు



పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే కాండ్రకోట నూకాలమ్మతల్లి పసర పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ, ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామిల ఆధ్వర్యంలో వరి నాట్లు పూర్తి అయ్యాక రైతు పండుగగా జరుపుకునే పసర పండుగ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఆసాదులు గ్రామంలో ఉన్న రైతుల ఇంటికి బాజా భజంత్రీలు, అమ్మవారి ఆలయం నుంచి ఈ ఏడాది పంటలు బాగా పండాలని కోరుతూ బుట్టతో అమ్మవారిని ఊరేగిస్తూ అమ్మవారికి నివేదిస్తారు. ప్రతి రైతు అమ్మవారి దయ కోరుతూ ఇంటికి వచ్చిన ఆసాదుల బుట్టలో నైవేద్యం సమర్పించి తల్లికి అత్యంత ప్రాధాన్యంతో మొక్కుతూ ఏటా పసర పండుగ నిర్వహిస్తారు.

ముగిసిన ముసలమ్మ తల్లి ఉత్సవాలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే పులిమేరు ముసలమ్మ తల్లి సంబరాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఏటా నిర్వహించే అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా వేకువ జాము నుంచి పూజలు నిర్వహించి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, గరగల నత్యం, మ్యూజికల్ నైట్ వంటి పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సంతర్పణ నిర్వహించగా పులిమేరు, గోరింట, గుడివాడ, దివిలి, చంద్రమాంపల్లి, చదలాడ, ఉలిమేశ్వరం గ్రామాలతో పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశుమాంసం స్వాధీనం



పశుమాంసంతో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న పశుమాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గొల్లప్రోలు మండలం చెందుర్తిలోని ఓ ఇంటి నుంచి పశుమాంసం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఆటోలో పశుమాంసం తరలిస్తునట్టు గుర్తించిన పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పశుమాంసాన్ని తరలిస్తున్న చెందుర్తికి చెందిన జి.రఘుబాబును అరెస్టు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రహదారిపై ఇరుక్కుపోయిన ఊకలోడు లారీ



జగన్నాథపురం శివారులో ప్రధాన రహదారిపై ఇరుక్కుపోయిన లారీ

గోకవరం: మండలంలోని జగన్నాథపురం గ్రామ శివారున ప్రధాన రహదారిపై ఆదివారం ఊకలోడు లారీ ఇరుక్కుపోయింది. భారీ లోడుతో ఉన్న ఊక లారీ గోతిలో పడి ఇరుక్కుపోవడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న గోకవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ప్రమోదాయ.. పర్యావరణ హితాయ..



మట్టి గణపతి విగ్రహాలను తయారు చేస్తున్న కుటుంబం



విక్రయానికి సిద్ధంగా ఉన్న పీఓపీ గణపతి విగ్రహాలు

- ముమ్మరంగా గణపతి విగ్రహాల తయారీ
- పోటాపోటీగా పీఓపీ, మట్టి ప్రతిమల ఏర్పాటు

సామర్లకోట: వినాయక చవితి పండగ అంటేనే పెద్ద ప్రహసనం. పోటాపోటీగా విగ్రహాల ప్రతిష్ఠ.. అంతకు మించిన పందిళ్లు.. నిత్య పూజలు వగైరా. గణపతి ఆలయాలతో పాటు పందిళ్లు, ఇళ్లలో, వ్యాపార సంస్థల్లో ప్రతిమలను నెలకొల్పి పూజలు చేస్తారు. వినాయక ప్రతిమలు చేయడంలో రాజస్థాన్ నుంచి వచ్చిన ఒక కుటుంబానిది అందెవేసిన చేయి. ఎంతో కళాత్మకంగా, జీవం ఉట్టిపడేలా వివిధ ఆకారాల్లో, పరిమాణాల్లో విగ్రహాలను వీరు తయారు చేస్తున్నారు. ఐదు తూముల వద్ద పాత వంతెనపై గుడారాలు ఏర్పాటు చేసుకుని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నారు. అడుగు నుంచి పది అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు తయారు చేస్తున్నారు.

మట్టి విగ్రహాలే మేలు..

గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగిశాక స్వామిని నిమజ్జనం చేస్తే త్వరగా భూమిలో కలసిపోయేలా మన్నుతో విగ్రహాన్ని తయారుచేయాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. పీఓపీతో చేసిన విగ్రహాలు నీటిలో కరగవు, మట్టిలో కలవవు. దీంతో పర్యావరణానికి హాని ఎక్కువ. దాంతో మట్టి విగ్రహాలను కూడా ఉత్సవ కమిటీలు భారీగానే కొనుగోలు చేస్తున్నాయి.

నాలుగు అంగుళాల నుంచి..



గత 20 ఏళ్లుగా గణపతి మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నాం. అనేక మంది ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేయడానికి తమకు ఆర్డర్లు ఇస్తుంటారు. దాంతో నాలుగు అంగుళాల నుంచి నాలుగు అడుగుల వరకు విగ్రహాలను తయారు చేస్తున్నాం. రూ.10 నుంచి రూ.10వేల వరకు విక్రయిస్తున్నాం. జి. రాగంపేట చెరువులోని మట్టితో విగ్రహాలను తయారు చేస్తున్నాం.

– కర్రి అప్పలరాజు, విగ్రహాల తయారీదారు, సామర్లకోట

మట్టి విగ్రహాలే మంచివి



చవితి ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలి. ఈ మేరకు పట్టణ పరిధిలో ర్యాలీ నిర్వహించి ప్రచారం చేస్తున్నాం. దీనిపై ప్రజలలో అవగాహన పెంచడానికి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నాం. పీఓపీ విగ్రహాలు తయారు చేసే వారిపై నిషేధ ఉత్తర్వులు జారీ చేస్తాం. భావితరాలకు స్వచ్ఛమైన తాగునీరు, పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

– జె.రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

గణపతి నవరాత్రులకు పందిరి రాట ముహూర్తం



పందిరి రాట వేస్తున్న వైస్ ఎంపీపీ రాజా



కొత్తపల్లిలో గణపతి నవరాత్ర ఉత్సవాలకు పసుపు రాట వేస్తున్న భక్తులు

పెద్దాపురం: ఈ నెల 19వ తేదీ వినాయక చవితి సందర్భంగా నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. మండలంలోని మర్లావలో వైస్ ఎంపీపీ మిరియాల రాజా దంపతు పందిరి రాట వేశారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది.

కొత్తపల్లి: గ్రామాల్లో గణపతి నవరాత్ర ఉత్సవాల సందడి ప్రారంభమైంది. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం చవితి ఉత్సవాలకు పందిరి రాట వేశారు. స్థానిక ఎంపీపీ పాఠశాల వద్ద ఉన్న జై గణేష్ ఆలయం వద్ద నవరాత్ర మహోత్సవాలకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పసుపు రాట వేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్టీలెవెల్ పార్కింగ్ స్థలంలో 225 కార్ల నిలిపివేత



సత్యగిరి పక్కన మల్టీలెవెల్ పార్కింగ్ స్థలంలో నిలిపివేసిన కార్లు

అన్నవరం: భక్తుల వాహనాలు నిలిపివేసేందుకు దేవస్థానంలోని సత్యగిరి దిగువన ఏర్పాటు చేసిన మల్టీలెవెల్ పార్కింగ్ స్థలంలో ఆదివారం 225 కార్లు నిలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో ఇక్కడ కార్లను నిలిపివేయడం ఇదే ప్రథమం. వివాహాల సీజన్, శని, ఆదివారాలు సెలవు కావడంతో దేవస్థానానికి వందలాది వాహనాల్లో పెళ్లి బృందాలు, భక్తులు వచ్చారు. వీరి వాహనాలను నిలిపివేయడానికి దేవస్థానంలో పార్కింగ్ స్థలం సరిపోకపోవడంతో మల్టీలెవెల్ పార్కింగ్‌లో నిలిపివేశారు. ఇక్కడ సుమారు 600 కార్లు నిలిపివేసేలా స్థలాన్ని చదును చేయించినట్టు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు.

గోకవరంలో 144 సెక్షన్ అమలు

గోకవరం: గోకవరం మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్సై యువి శివనాగబాబు ఆదివారం తెలిపారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. పబ్లిక్ స్థలంలో ముగ్గురు కంటే ఎక్కువ మంది ఉండకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చంద్రబాబు అరెస్టు సమంజసమే

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో విలేకర్ల సమావేశం
- రూ.కోట్లు తినేసి.. ఇప్పుడు ఖర్చు చేస్తున్నారని మండిపాటు



పిఠాపురంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు

పిఠాపురం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు బినామీ కంపెనీల పేరుతో రూ.వందల కోట్లు తినేశారు కాబట్టే ఇప్పుడు కేసు నుంచి తప్పించుకోడానికి రూ.కోట్లు ఖర్చు పెడుతున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురంలో వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టు సమంజసమే అన్నారు. రూ.కోట్లు ఖర్చు చేసి ప్రత్యేక విమానాల్లో లాయర్లు, బంధువులు, దత్తపుత్రుడిని తీసుకువస్తున్నారంటే ఎన్ని వేల కోట్లు దోచేసి ఉంటారో అర్థమవుతోందన్నారు. ఆరోపణలు వచ్చినప్పుడు ఏతప్పూ చేయకపోతే న్యాయస్థానాల్లో నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. అంతేతప్ప ఏదో తమను అక్రమంగా, అన్యాయంగా అరెస్టు చేశారని మొసలి కన్నీరు కారిస్తే నమ్మే జనం ఇప్పుడు లేరన్నారు. నిజాయితీ పరుడిపై నిందలు మోపినట్లు టీడీపీ నేతలు చంద్రబాబు అరెస్టును రాజకీయం చేస్తున్నారన్నారు. తప్పు చేస్తే ఎప్పటికైనా శిక్ష తప్పదు అనేది చంద్రబాబు అరెస్టుతో నిజమైందన్నారు. ఈ ఒక్క దానికే టీడీపీ నేతలు ఇలా ఉలిక్కిపడితే ఇంకా రూ.వేల కోట్ల విలువైన దోపిడీలు బయటకు వస్తాయని, అప్పుడు ఏం చేయాలో తెలియక టీడీపీ నేతలు పారిపోవాల్సి వస్తుందన్నారు. చంద్రబాబు నిజయితీ పరుడే అయితే 18 కేసుల్లో కోర్టుల నుంచి స్టేలు ఎందుకు తెచ్చుకున్నారో ఆ పార్టీ నేతలే చెప్పాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కచ్చితమైన ఆధారాలు ఉన్నాయి కాబట్టే ఆయనను పోలీసులు అరెస్టు చేశారన్నారు. చంద్రబాబు అరెస్టును ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. ఆయన అరెస్టుపై టీడీపీ నేతలు తప్ప ప్రజలెవ్వరూ స్పందించిన ఆనవాళ్లు లేవన్నారు. బాబు చేసిన అక్రమాలకు ఇది ఆరంభం మాత్రమేనని, త్వరలో అన్ని అక్రమాలు బయట పడతాయన్నారు. ఎదుటి వారిని విమర్శించే ముందు తాము నిజాయితీ పరులమా ? కాదా ? అనేది చూసుకోవాలన్నారు. చంద్రబాబు నిజస్వరూపం అరెస్టు కావడంతో ప్రజలకు తెలిసిపోయిందని, ఇక టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు చివరి అంకం జైలు జీవితమే అన్నారు. ఇప్పుడు రూ.కోట్లు ఖర్చు పెట్టి ఈ కోర్టులో తప్పించుకున్నా మరో చోటైనా నేరం రుజువవుతుందని, అప్పుడైనా శిక్ష అనుభవించక తప్పదన్నారు.

చంద్రబాబు అరెస్టుపై సొంత కొడుకు లోకేష్ కంటే ఎక్కువగా దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ స్పందించడం చూస్తుంటే ప్యాకేజీలు నిజమేనని ప్రజలకు అర్థమైందన్నారు. చంద్రబాబు దోచుకున్న దానిలో వాటాలు అందాయి కాబట్టే పవన్ అంత కంగారు పడి రోడ్డుపై దొర్లుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, రెడ్డెం జనార్దన్, నడిగట్ల చింతలరావు, ఉమ్మిడి జాన్, బండి దావీదు, గుండ్ర రాజబాబు, వగ్రపు వీరేష్, బొజ్జా దొరబాబు, నక్కా మణికంఠ, బుజ్జి, బాలిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యకల్యాణంలో దండిగా కానుకలు

- ఆదివారం ఒక్కరోజే రూ.10,200 సమర్పించిన భక్తులు
- గత నెల 13 నుంచి ఇప్పటివరకూ రూ.70 వేల ఆదాయం



రత్నగిరిపై స్వామివారి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: సత్యదేవుని నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామి, అమ్మవార్లకు కట్న కానుకలు దండిగా సమర్పిస్తున్నారు. శ్రావణ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం కల్యాణ భక్తులు రూ.10,200 కట్నకానుకలు సమర్పించారు. గత నెల 13వ తేదీ నుంచి భక్తులు కట్నకానుకలు సమర్పించే విధానాన్ని ఈఓ చంద్రశేఖర్ అజాద్ పునరుద్ధరించిన విషయం తెలిసిందే. దేవస్థానానికి కట్న కానుకల రూపంలో ఇప్పటివరకూ సుమారు రూ.70 వేలు ఆదాయం వచ్చింది. దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వర శర్మ, అర్చకులు రామ్‌కుమార్, పురోహితులు పాలంకి పట్టాభి తదితరులు ఆదివారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం కామేశ్వరశర్మ స్వామివారికి కట్న కానుకలు సమర్పించాలని కోరారు. దీంతో భక్తులు వెల్లువగా వచ్చి కట్నకానుకలు సమర్పించారు. రూ.500 కన్నా తక్కువ నగదును హుండీలో వేశారు. రూ.558 కన్నా ఎక్కువ మొత్తాలను రికార్డులో రాసి వారి గోత్రనామాలను పండితులు చదివి ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిత్య కల్యాణం..పచ్చతోరణం..

సత్యదేవుని సన్నిధిలో ప్రతి నిత్యం సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారికి ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు స్వామివారికి కల్యాణం నిర్వహిస్తారు. శ్రావణం, ఆశ్వీయుజం, కార్తికం, మాఘం, వైశాఖం వంటి మాసాల్లో రోజుకు 50 మంది వరకూ భక్తులు రూ.1,116 టిక్కెట్‌తో స్వామివారి కల్యాణంలో పాల్గొంటారు. మిగిలిన రోజుల్లో భక్తుల సంఖ్య తక్కువగా ఉంటుంది. ఏటా స్వామివారి కల్యాణాలు సుమారు ఐదు వేలు జరుగుతున్నాయి.

మండపం నిర్మాణానికి భూమిపూజ



లోవకొత్తూరులో మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు, దాతలు

తుని రూరల్: లోవకొత్తూరులో తలుపులమ్మ అమ్మవారి ఉప ఆలయం ఎదుట మండపం నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. తునికి చెందిన దాత మాగపు వీర వెంకట ఆంజనేయులు అమ్మవారి ఉపాలయం వద్ద మండపం నిర్మించేందుకు అంగీకరించి భూమి పూజ చేశారు. ఆలయ ఈఓ ఆదేశాల మేరకు ఏఈలు వీరభద్రరావు, శ్రీను మార్కింగ్ చేయగా దాత కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. మండపానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని దాత చెల్లించనున్నారు. లోవకొత్తూరులోని తలుపులమ్మవారి ఉప ఆలయం వద్ద ఏటా గంధామావస్య పర్వదినాల్లో 12 రోజుల పాటు తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలు నిర్వహించడం ఆనవాయితీ. మండపం నిర్మాణంతో ఉపాలయం అభివృద్ధి చెందనుంది.

గోదావరి కాలువలో వ్యక్తి మృతదేహం

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని సీఐ కె.దుర్గాప్రసాద్ ఆదివారం తెలిపారు. కెనాల్ రోడ్డులోని హుస్సేన్‌పురం ఎస్సీపేట వద్ద కాలువలో మృతదేహం ఉందనే సమాచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉందని, వివరాలకు సీఐ 94407 96568, ఎస్సై టి.సునీత 97016 26505 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



25 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తుని: స్థానిక రాజా ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 వసంతాల తరువాత బమ్మిడిపల్లి మూర్తి, కటారి వీర్రాజు ఆధ్వర్యంలో తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఆలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. ఒకరి కష్టసుఖాలను మరొకరికి చెప్పుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. అలనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన హెడ్‌మాస్టారు శేషగిరి, ఉపాధ్యాయులు నారాయణమూర్తి, జోగిశాస్త్రి, కృష్ణమూర్తి దంపతులను సన్మానించారు. పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సాగరతీరం.. జనహోరం



పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ సాగరతీరం

- పర్యాటకులతో కిటకిటలాడిన ఉప్పాడ తీరం
- బీచ్‌రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం



కడలి కెరటాల్లో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

కొత్తపల్లి: మండలంలో ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. పర్యాటకుల ఆటల పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. ఉదయం లోవలోని తలుపులమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి సాగర తీరానికి చేరుకున్నారు. కడలి కెరటాల్లో పిల్లలు, పెద్దలు కేరింతలు కొట్టారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్సై రామలింగేశ్వరరావు తన సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జోరుగా అపరాల పంట ఒబ్బిడి



చామవరంలో సాగు చేసిన మినప పంట



పక్వానికి వచ్చిన మినప కాయలు

తుని రూరల్: వేసవిలో ఆరుతడిగా సాగు చేసిన అపరాల పంటలను రైతులు ఒబ్బిడి చేస్తున్నారు. పండిన మినుము, పెసర, కొమ్ము శెనగ చేలను కోసి పొలంలోనే ఎండబెడుతున్నారు. కొంతమంది రైతులు ఎండిన పంట నుంచి అపరాలు సేకరిస్తున్నారు. తుని మండలంలోని ఎస్.అన్నవరం, చామవరం, హెచ్.కొత్తూరు, టి.తిమ్మాపురం, దొండవాక, కొలిమేరు, ఎన్.సూరవరం తదితర గ్రామాల్లో రైతులు అపరాల సాగు చేస్తున్నారు. తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 180 ఎకరాల్లో రైతులు అపరాలు సాగు చేసినట్టు వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు. కాగా అపరాల పంట కోతలు ఈ నెలాఖరుకు పూర్తవుతాయని చెప్పారు. ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వరిసాగు చేయలేని రైతులు ప్రత్యామ్నాయంగా అపరాలు సాగు చేయాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు.